సాక్షి
అనంతపురం
శనివారం। 7 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.8.50

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.2.50, సరాసరి రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.8°/22.7°

జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి పూట స్థిరంగా నమోదైంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఈ-క్రాప్ గడువు 9 వరకు



రాప్తాడులో ఈ-క్రాప్ సూపర్‌చెక్ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంట నమోదుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ ఈనెల 9వ లోపు పూర్తి చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ నెలాఖరుతోనే గడువు ముగియగా... తాజాగా 9వ తేదీ వరకు గడువును పొడిగించారు. కాగా ఈ-క్రాప్ నమోదు 99 శాతానికి పైగా పూర్తి కాగా.. ఈ-కేవైసీ 60 శాతం వరకు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగతా 1 శాతం ఈ-క్రాప్, 40 శాతం ఈ-కేవైసీ ఈ రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతానికి అన్ని రకాల వ్యవసాయ పంటలు 2,35,006 హెక్టార్లు (5,87,515 ఎకరాలు), అన్ని రకాల ఉద్యాన పంటలు 1,13,036 హెక్టార్లు (2,82,590 ఎకరాలు) మొత్తంగా ఈ-క్రాప్‌లో 3,48,042 హెక్టార్లు (8,70,105 ఎకరాలు) నమోదు చేశారు. ఈ-క్రాప్ ఆధారంగా ఇన్‌పుట్‌సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట రుణాల సున్నావడ్డీ, ఎంఎస్‌పీతో పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర ప్రయోజనాలు ముడిపడి వున్నందున ప్రతి రైతూ స్వచ్ఛందంగా ఆర్‌బీకే అసిస్టెంట్లను కలిసి ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచించారు. ఈ-క్రాప్ పూర్తయిన రైతులు ఫోన్ ద్వారా ఓటీపీ సదుపాయంతో ఈ-కేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

'ధర్మసంకల్ప సభ' వాయిదా



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ నెల 8న అనంతపురంలో జరగాల్సిన 'ధర్మ సంకల్ప సభ'ను వాయిదా వేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 9న సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభ ఉన్నందున 'ధర్మ సంకల్ప సభ' వాయిదా వేసినట్లు వెల్లడించారు. తదుపరి సభ తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పరికరాలు చేర్చండి



క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: జిల్లాలోని 663 గ్రామ, వార్డు సచివాలయాలకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పరికరాలను చేరవేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించిన పరికరాలను కలెక్టర్ శుక్రవారం పరిశీలించిన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై సమీక్షించారు. నవంబర్ రెండో వారంలో 'ఆడుదాం ఆంధ్రా ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆటస్థలాల గుర్తింపు తదితర అంశాలపై క్రీడాప్రాధికార సంస్థ అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూఏ పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఆగస్టులో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-20 రెగ్యులర్), (ఆర్-19 రెగ్యులర్), మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్-20, 19, 15) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలని కోరారు.

పొదుపు.. సరికొత్త మలుపు

అక్కచెల్లెమ్మలు ఆర్థిక సాధికారత దిశగా పయనిస్తున్నారు. స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)లో సభ్యులుగా ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటున్నారు. టీడీపీ హయాంలో డిఫాల్ట్‌గా ముద్రపడిన సంఘాలు జగనన్న సర్కారులో పూర్వ వైభవం సంతరించుకున్నాయి. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాయి.

- సాధికారత దిశగా డ్వాక్రా మహిళలు
- క్రమం తప్పకుండా పొదుపు
- రుణాల చెల్లింపుల్లోనూ టాప్
- డిఫాల్ట్ నుంచి నిలకడ స్థాయికి..
- వైఎస్సార్‌సీపీ పాలనలో పుంజుకున్న సంఘాలు
- పొదుపు సొమ్మును సభ్యులే వినియోగించుకునేందుకు కసరత్తు



అనంతపురం రూరల్ పరిధిలో సమావేశమైన పొదుపు సంఘం సభ్యులు

అనంతపురం: డ్వాక్రా/మహిళా సంఘాలలో 'పొదుపు' సరికొత్త మలుపు తిరిగింది. గడిచిన రెండేళ్లుగా జిల్లాలో డ్వాక్రా సంఘాలు ప్రతి నెలా చేసుకుంటున్న పొదుపు సుమారు రూ.13 కోట్లకు చేరింది. అంటే ఏడాదికి రూ.156 కోట్ల మేర ఉంటోంది. సంఘంలో సభ్యురాలిగా ఉన్న మహిళ ప్రతి నెలా వంద రూపాయలు తప్పనిసరిగా పొదుపు చేసుకోవాలన్న నిబంధన ఉంది. రాష్ట్రంలో పొదుపు సంఘాల వ్యవస్థ మొదలైన కొత్తలో రోజుకు రూపాయి చొప్పున నెలకు రూ.30 పొదుపు చేసుకునేవారు. క్రమంగా ఆ మొత్తం వంద రూపాయలకు చేరింది. సంఘంలో ఎంత మంది సభ్యులు ఉంటే అంతమంది ప్రతి నెలా సమావేశమై, తమ స్థితిగతులను చర్చించుకుంటారు. అందరి సభ్యుల పొదుపును పోగు చేసి, సంఘం పేరిట బ్యాంకులోని పొదుపు ఖాతాల్లో జమ చేసుకుంటారు. ఈ మొత్తానికి తోడు సభ్యుల రుణ చెల్లింపుల రికార్డు ఆధారంగా ఆయా సంఘాలకు బ్యాంకులు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేస్తుంటాయి.

నాడు విలవిల.. నేడు కళకళ

చంద్రబాబు పాలనలో 2014 జూన్ తర్వాత నుంచి 2016 మార్చి మధ్య చాలా నెలల పాటు గ్రామీణ ప్రాంత పొదుపు సంఘాల మహిళలు ప్రతి నెలా రూ.లక్షల్లో మాత్రమే పొదుపు చేసుకునే పరిస్థితి ఉండేది. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళల బ్యాంకు రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక విస్మరించారు. దీంతో అప్పట్లో పొదుపు సంఘాల మహిళలు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి ఉండేది. పొదుపు పట్ల కూడా ఆసక్తి తగ్గిపోయింది. చాలా డ్వాక్రా సంఘాలపై బ్యాంకర్లు 'డిఫాల్ట్'గా ముద్ర వేశారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు వర్తింపజేశారు. దీంతో పొదుపు సంఘాలు మళ్లీ గాడిలో పడ్డాయి. యథావిధిగా కార్యకలాపాలు సాగుతుండడంతో సంఘాలు కళకళలాడుతున్నాయి. పరపతి పెరగడంతో డ్వాక్రా సభ్యులకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయి. మహిళలు కూడా రుణాలను జీవనోపాధులకు ఉపయోగించుకుంటున్నారు. రుణ కంతులు సకాలంలో చెల్లించి బ్యాంకర్లకు నమ్మకస్తులుగా మారారు.

'పొదుపు'ను సభ్యులూ వినియోగించేలా..

పొదుపు సంఘాల మహిళలు ప్రతి నెలా దాచుకున్న డబ్బు ఇప్పటి వరకు బ్యాంకు పొదుపు ఖాతాల్లో ఉంది. వారు ఆ డబ్బును అలానే తక్కువ వడ్డీ వచ్చే పొదుపు ఖాతాలో ఉంచి.. అధిక వడ్డీకి అవే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. వారి పొదుపు డబ్బుకు 4 శాతం వడ్డీ వస్తుండగా, వారు బ్యాంకుల నుంచి 10 శాతం వడ్డీకి రుణాలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక నుంచి మహిళలు తమ పొదుపు సొమ్మును సంఘంలో డబ్బు అవసరం ఉన్న మహిళలకు అప్పుగా ఇచ్చిన తర్వాతే.. ఇతరులకు అవసరం మేరకు బ్యాంకుల నుంచి రుణం తీసుకునేలా సెర్ప్ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

జిల్లాలో డ్వాక్రా సంఘాలు	12,438
డ్వాక్రా సభ్యులు	1,24,386
నెలవారీ పొదుపు	రూ.13 కోట్లు

పొదుపు పెంపుదలకు ప్రణాళిక



డ్వాక్రా సంఘాల్లో పొదుపు మొత్తం పెంపుదల చేసేలా పటిష్టమైన ప్రణాళికను అమలు చేస్తున్నాం. రుణ చెల్లింపుల్లో 99 శాతం మంది గడువులోపే పూర్తి చేస్తున్నారు. పొదుపు మీద తిరిగి రుణం తీసుకునే అవకాశం కల్పిస్తున్నాం.
– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

బ్యాంకుల అంగీకారం..

బ్యాంకులు కూడా పొదుపు సంఘాలలో డబ్బును ష్యూరిటీగా ఉంచుకుని ఆయా సంఘాలకు కావాల్సిన మొత్తం రుణంగా ఇవ్వడం పరిపాటిగా కొనసాగుతోంది. కాగా, రుణ పంపిణీకి ఇబ్బంది లేకుండా పొదుపు సంఘాల మహిళలు తమ పొదుపు ఖాతాలో ఉన్న మొత్తాలను తొలుత తమ అవసరాలకు ఉపయోగించుకోవడానికి వీలుగా ఎస్‌బీఐ, గ్రామీణ బ్యాంకులు, డీసీసీబీ ఇప్పటికే అంగీకారం తెలిపాయి. తద్వారా మహిళలు బ్యాంకు రుణాలపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది.

నెలవారీ పొదుపు పెంచుకున్నాం



పొదుపు సంఘం సభ్యురాలికి అత్యవసరమైన పరిస్థితిలో కూడా పొదుపుపై అప్పు తీసుకునే వెసలుబాటు ఉంది. సంఘం పొదుపును బట్టి మాకు రూ.20 లక్షల రుణం మంజూరు చేశారు. ప్రారంభంలో నెలకు రూ.50 పొదుపు చేసేవాళ్లం. తాజాగా రూ.300 నెల వారీ పొదుపు చేస్తున్నాం.
– ఎస్.హస్మత్ బీ, ఎ.నారాయణపురం, అనంతపురం రూరల్ మండలం

పొదుపు రుణంతో వ్యాపారానికి పెట్టుబడి



పొదుపు చేయడం వల్ల దానిమీద తిరిగి రుణం తీసుకుని వ్యాపార పెట్టుబడిగా పెట్టడానికి దోహదం చేస్తోంది. మేము టైలరింగ్, క్లాత్ బిజినెస్ చేస్తున్నాం. ఇప్పటి దాకా మా సంఘంలో రూ.20,400 దాకా పొదుపు చేసుకున్నాం. మొదట్లో నెలకు రూ.50 పొదుపు చేసేవాళ్లం. తాజాగా రూ.200 పొదుపు కడుతున్నాం.
– కె.లక్ష్మి, టైలరింగ్, క్లాత్ బిజినెస్, తపోవనం, అనంతపురం

రూ.20 లక్షల రుణం తీసుకున్నాం.



మా గ్రూపులో సంఘం నిధి అధికంగా ఉంది. దీంతో మా సంఘం తరఫున రూ.20 లక్షల రుణం తీసుకున్నాం. దీంతో సభ్యులందరం వ్యాపార కార్యకలాపాలు సజావుగా నిర్వహించుకోవడానికి సులువు అయింది. నెలకు రూ.250 చొప్పున ఒక్కొక్కరు పొదుపు చేస్తున్నాం. ఇప్పటిదాకా రూ.17,100 పొదుపు చేశాం.
– జి.లలిత, టైలరింగ్, విద్యారణ్యనగర్, అనంతపురం రూరల్ మండలం

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

- ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలోని 25 ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాలు
- 7,325 మందికి ఓపీ సేవలందించిన వైద్యులు
- 306 మందికి మెరుగైన వైద్యం కోసం సిఫారసు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం మెడికల్: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఉన్న ఊరిలోనే వైద్యం చేయించేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం చేపట్టింది. ఇంటింటికీ వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందిని పంపి ప్రజల ఆరోగ్య సమస్యలపై సర్వే చేయించింది. వైద్యం అవసరమైన వారి కోసం స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులతో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో శుక్రవారం 25 ప్రాంతాల్లో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించారు. అన్ని చోట్ల విశేష స్పందన లభించింది. దీర్ఘకాలిక రోగులతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు వైద్య శిబిరాలకు తరలివచ్చారు. వైద్యులు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ అన్ని రకాల వైద్యపరీక్షలు చేసి కేస్‌షీట్లలో వారి ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. 7,325 మంది ఓపీ వైద్య సేవలందుకున్నారు. వీరిలో 1,456 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 306 మందిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రి, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు స్పెషలిస్టు వైద్యులు సిఫారసు చేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. శెట్టూరు మండలం అయ్యగారిపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కుటుంబంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారి జీవన స్థితిగతులపై ప్రభావం చూపుతుందన్న ఆలోచనతో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఇంటింటా స్క్రీనింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతి ఒక్కరూ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ఆత్మకూరు మండలం సనపలో 'ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంపును ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేలా ప్రభుత్వాస్పత్రులను సీఎం వైఎస్ జగన్ బలోపేతం చేశారన్నారు.
- పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

నేడు 26 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు

జిల్లాలోని 26 ప్రాంతాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి పేర్కొన్నారు. పల్లేపల్లి, కేశేపల్లి, హనిమిరెడ్డిపల్లి, కొజ్జేపల్లి, సంతెకొండాపురం, ఊరిచింతల, మలపనగుడి, గులిమికొండ్లకొట్టాల, ఎస్ హనుమాపురం, కొర్రకోడు, కుందుర్పి, అక్కంపల్లి, ఓబుళాపురం, గడేకల్లు, నరసాపురం, చిత్రచేడు, మడుగుపల్లి, మోపిడి, మరూరు, పుప్పాల, ఆకులేడు, కొనకొండ్ల, యల్లనూరు, కమలాపురం, చెన్నంపల్లి, యూపీహెచ్‌సీ, నాయక్‌నగర్‌లో వైద్య శిబిరాలుంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యం

- కేజీబీవీలపై సర్కారు ప్రత్యేక దృష్టి
- ఇటీవలే ఉమ్మడి జిల్లాలో 191 టీచింగ్ పోస్టుల భర్తీ
- ఎఫ్ఏ-1 ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్
- ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్న కేజీబీవీలు



రాయదుర్గం కేజీబీవీ జూనియర్ కళాశాల

అనంతపురం ఎడ్యుకేషన్: అనాథ, నిరుపేద బాలికలు చదువుకుంటున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టింది. అనంతపురం జిల్లాలో మొత్తం 32 కేజీబీవీలు ఉన్నాయి. 6-10 తరగతుల విద్యార్థినులు 6,322 మంది, ఇంటర్ 1,749 మంది కలిపి మొత్తం 8,071 మంది ఉన్నారు. విద్యార్థినులు చదువుకోవడానికి అన్ని వసతులు కల్పించిన ప్రభుత్వం.. ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను ఇటీవలే భర్తీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 279 ప్రిన్సిపాల్, సీఆర్టీ, పీజీటీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 191 పోస్టులు భర్తీ అయ్యాయి. అర్హులైన అభ్యర్థులు లేక 88 పోస్టులు భర్తీ కాలేదు. ఇందులో అనంతపురం జిల్లాలో 39 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 32 మంది ఎస్ఓలు, 235 మంది సీఆర్టీలు, 114 మంది పీజీటీలు పని చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే చాలావరకు పోస్టులు భర్తీ చేయడంతో బోధనకు ఆటంకం లేకుండా సాగుతోంది.

వెనుకబడిన విద్యార్థినులపై ఫోకస్

గత ఆగస్టు నెలలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)-1 పరీక్షల ఫలితాల ఆధారంగా 50 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. కేజీబీవీల వారీగా ప్రణాళికలు తయారు చేసుకుని ఎఫ్ఏ-2 పరీక్షల నాటికి ఆ విద్యార్థుల్లో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీల కార్యదర్శి నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ క్రమంలో ఆయా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇస్తున్నారు సీఆర్టీలు, పీజీటీలు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులపై స్పెషల్ ఫోకస్ పెట్టాం. ఎస్ఓలు, సీఆర్టీలు, పీజీటీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశాం. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగుపడేలా చూస్తున్నాం.
– వి.నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష

మెనూ అమలు కావాల్సిందే

అన్ని కేజీబీవీల్లోనూ మెనూ పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అమ్మాయిల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక మెనూ రూపొందించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం

అనంతపురం క్రైం: మానవతప్పిదాలతో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ నగరంలో పోలీసు, ఆర్టీఏ శాఖల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ అన్బురాజన్ హాజరయ్యారు. తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్రారంభమైన 2కే రన్‌ను ఎస్పీ అన్బురాజన్, ఉప రవాణా కమిషనర్ ఎం.వీర్రాజు జెండా ఊపి ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ మీదుగా సుభాష్ రోడ్డు, టవర్‌క్లాక్ దాకా రన్ కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో విధిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, ట్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయకుమార్‌రెడ్డి, హనుమంతు, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శేషాద్రి, అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న ఎస్పీ అన్బురాజన్, అధికారులు

మెడికో మృతి

- బావిలో తేలిన మృతదేహం



చైతన్య (ఫైల్)

పెద్దపప్పూరు: అదృశ్యమైన వైద్య విద్యార్థి (మెడికో) మృతి చెందాడు. శుక్రవారం వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లికి చెందిన పి.చైతన్య (27) కర్నూలులోని ఓ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. వినాయక చవితి పండుగ సమయంలో ఇంటికి వచ్చాడు. అయితే ఏమైందో తెలియదు కానీ ఈ నెల మూడో తేదీ తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకెళ్లాడు. మూడు గంటలకు ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వచ్చింది. కుమారుడు కనిపించడం లేదని తల్లి యశోద అదే రోజు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించి అన్ని స్టేషన్లకు విద్యార్థి ఫొటోను పంపించి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం కొట్టాలపల్లి - పసలూరు గ్రామాల మధ్యన గల రోడ్డుపై దుర్వాసన రావడంతో పాదచారులు సమీపంలో గాలించారు. రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో యువకుడి మృతదేహం తేలియాడుతుండటం గమనించారు. ఈ విషయం సమీప గ్రామాల వారి దృష్టికి వెళ్లింది. దుస్తులను బట్టి మృతి చెందిన యువకుడు చైతన్య అని కుటుంబ సభ్యులు గుర్తించారు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో యశోద బోరున విలపించారు. ఎస్ఐ ఖాజాహుస్సేన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. చైతన్య మృతికి గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ప్రకృతి వ్యవసాయంపై నేడు, రేపు అధ్యయనం

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి విదేశీ ప్రతినిధుల బృందం శనివారం, ఆదివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నట్లు డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు. బృందంలో ఆఫ్రికా దేశాలైన సెనెగల్, టునీషియా, బెనిన్, మడగాస్కర్, జాంబియా, మలవాయి తదితర దేశాల నుంచి 27 మంది ప్రతినిధులు ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు టి.విజయకుమార్ ఆధ్వర్యంలో విదేశీ బృందం శనివారం ఉదయం 10 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానాలను తిలకిస్తుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు అనంతపురం చేరుకుంటారన్నారు. ఆదివారం ఉదయం 9.45 గంటలకు బత్తలపల్లి మండలం గంటాపురంలో పర్యటిస్తారని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సమావేశమై చర్చిస్తారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ జిల్లా పులివెందులకు బయల్దేరతారని వెల్లడించారు.

టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 లాన్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ తెలిపారు. నారాయణ టెన్నిస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ నిర్వహించామన్నారు. బాలుర విభాగంలో ఎస్. రొనాల్డో, షేక్ రియాజ్, కే. మోహన్, చంద్రదీప్, జి.అరవింద్ ఎంపికైయ్యారు. స్టాండ్ బైగా కే. క్రిపాల్‌కుమార్, ఏ.అజయ్, లక్ష్మీనరసింహను ఎంపిక చేశారు. అలాగే బాలిక విభాగంలో జి. నీరజ, ఎస్.ఆలియా, ఏ.జాహ్నవి, ఎం.సాయి సింధూజ, వైష్ణవి, జి.చేతనశ్రీ, ఎస్.కిరణ్మయిను ఎంపిక చేశారు.

వంద శాతమే లక్ష్యం

- 50 శాతంతో ముగిసిన రెండో త్రైమాసికం
- వందశాతం లక్ష్య సాధన దిశగా మార్కెటింగ్‌శాఖ
- శింగనమల, అనంత, ఉరవకొండ మార్కెట్లు టాప్



అనంతపురం అగ్రికల్చర్: వందశాతం లక్ష్య సాధన దిశగా మార్కెటింగ్‌శాఖ ముందుకెళ్తోంది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్ నెలాఖరుతో రెండో త్రైమాసికం ముగిసింది. గత ఆరు నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యసాధనలో 50 శాతానికి పైగా సాధించిన జిల్లా మార్కెటింగ్‌శాఖ వందశాతం దిశగా పయనిస్తోంది. జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో ఈ ఏడాది రూ.10.81 కోట్లు ఆదాయం గడించాలని లక్ష్యంగా పెట్టుకోగా మొదటి ఆరు నెలలు ముగిసేసరికి 51 శాతంతో రూ.5.52 కోట్లు వసూళ్లు చేశారు. ఆరు నెలల కాలంలో రూ.4.90 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.62 లక్షలు మేర అధికంగా సాధించారు. కాగా గతేడాది ఇదే సమయానికి రూ.4.72 కోట్లు వసూలైంది. అంటే గతేడాది కన్నా రూ.80 లక్షలు అధికంగా సాధించారు.

ముందంజలో మూడు

ఓవరాల్‌గా 51 శాతంతో లక్ష్యసాధన దిశగా పయనిస్తున్నా అందులో మూడు వ్యవసాయ యార్డు కమిటీలు ముందంజలో ఉన్నాయి. మరో మూడు కమిటీలు ఫరవాలేదన్నట్లుగా ఉండగా... మిగతా మూడు కమిటీలు చాలా వెనుకబడ్డాయి. ప్రధానంగా అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు రూ.4.10 కోట్లకుగానూ ఇప్పటికే 66 శాతంతో రూ.2.71 కోట్లు సాధించింది. అలాగే శింగనమల రూ.75 లక్షలకు గానూ 71 శాతంతో రూ.53.54 లక్షలతో మొదటిస్థానంలో నిలిచింది. 51 శాతంతో ఉరవకొండ మూడో స్థానంలో నిలిచాయి. అలాగే 46 శాతం వసూళ్లతో తాడిపత్రి, 43 శాతంతో కళ్యాణదుర్గం, 35 శాతంతో రాయదుర్గం పయనిస్తున్నాయి. అయితే 22 శాతంతో గుంతకల్లు అట్టడుగున ఉండగా ఆ తర్వాత 27 శాతంతో గుత్తి, రాప్తాడు మార్కెట్ కమిటీలు చివరి మూడు స్థానాల్లో లక్ష్యానికి ఆమడదూరంలో ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు అన్ని కమిటీలు వంద శాతం సాధించేలా యార్డులు, చెక్‌పోస్టుల్లో నిఘా, విజిలెన్స్ చర్యలు పటిష్టంగా అమలు చేస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ పి సత్యనారాయణ చౌదరి తెలిపారు.

స్వాహా రాయుళ్లపై చర్యలేవీ?

- డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించిన స్థాయీ సంఘ సభ్యులు

అనంతపురం సిటీ: డ్వాక్రా సంఘాల సభ్యులు పొదుపు చేసుకున్న సొమ్మును సిబ్బంది స్వాహా చేస్తున్నా డీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని చెన్నేకొత్తపల్లి, బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యులు గోవిందరెడ్డి, భాస్కర్ మండిపడ్డారు. పత్రికల్లో వచ్చినప్పుడు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, సమావేశాల్లో లేవనెత్తినప్పుడు ఏదో ఒక ప్రకటన ఇవ్వడం.. ఆ తరువాత స్వాహారాయుళ్లను వదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘం-2, 4 (గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం) సమావేశాలు నిర్వహించారు. జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుక్కరాయసముద్రం, చెన్నేకొత్తపల్లి మండలాల్లో డ్వాక్రా సభ్యుల సొమ్మును భారీగా స్వాహా చేశారని, ఆ మొత్తాన్ని వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు-నేడు కింద హైస్కూల్‌కు ఎనిమిది అదనపు తరగతి గదులు మంజూరు కాగా.. ఎంఈఓ మాత్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని నాలుగు గదులు చాలని రిపోర్ట్ రాశారని చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున మరో నాలుగు గదులు అదనంగా మంజూరు చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి కోరారు.



డీఆర్‌డీఏ అధికారుల తీరును ప్రశ్నిస్తున్న చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి

ప్రజాప్రతినిధులతో పద్ధతిగా మాట్లాడండి

జిల్లా పరిషత్‌లోని అదనపు సమావేశ భవనంలో నిర్వహించిన స్థాయీ సంఘం-5, 6(ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఈఓ లలితా బాయి చర్చను ప్రారంభించారు. జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ ప్రసాద్ తీరును సభ్యులందరూ తప్పుబట్టారు. అభాగ్యులైన పిల్లలకు ఒకట్రెండు సీట్లు సర్దుబాటు చేయలేకపోగా, సిఫారసు చేసిన ప్రజాప్రతినిధులను తక్కువ చేసి మాట్లాడటం తగదని హితవు చెప్పారు. ఇందుకు ఆయన 'నేనింతే'నంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఇంతలోనే జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితా బాయి జోక్యం చేసుకొని స్వరం తగ్గించి మాట్లాడాలంటూ మందలించారు. ప్రజాప్రతినిధులు ఏదైనా విషయంపై అడిగినప్పుడు సంయమనంతో సమాధానం ఇవ్వాలని సూచించారు. గాండ్లపెంట, బత్తలపల్లిలో బాలికల సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు.

ఉత్తీర్ణతపై దృష్టి సారించండి



అనంతపురం జూనియర్ కళాశాలలో డెస్కులు పరిశీలిస్తున్న ఆర్జేడీ రవి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉత్తీర్ణత సాధించేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు దృష్టి సారించాలని ఇంటర్ విద్య ఆర్జేడీ రవి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన వివిధ జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. అనంతపురంలోని కొత్తూరు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల, ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. 'నాడు నేడు' పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. ఇంటర్నల్ పరీక్షలు, యూనిట్ టెస్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వెనుకబడిన వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఆర్జేడీ వెంట డీవీఈఓ వెంకటరమణానాయక్, ఆర్ఐఓ సురేష్‌బాబు ఉన్నారు.

10న హంద్రీనీవాకు నీరు నిలిపివేత

ఉరవకొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలం జలాశయంలో తగినంత నీటి లభ్యత లేని కారణంగా ఈనెల 10న హంద్రీనీవా కాలువకు నీటిని నిలిపివేస్తున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. హంద్రీనీవాకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేసేలా ఐఏబీ సమావేశంలో అధికారులు నిర్ణయించారు. హంద్రీనీవా ద్వారా దిగువ ప్రాంతాలకు తాగునీరు అందించడానికి హెచ్ఎన్ఎస్ఎస్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హంద్రీనీవా పరిధిలో రైతులు ఎవరూ ఎలాంటి పంటలు సాగుచేసుకోవద్దని హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ రామకృష్ణయాదవ్ తెలిపారు.

చెరువులకు నీటి సరఫరా నిలిపివేత : హంద్రీనీవా పరిధిలోని గుంతకల్లు పరిధిలోని వైటీ చెరువు, పీకె చెరువు, ఆలూరు బ్రాంచ్, గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్, కమ్మకొట్టాల, ఛాయపురం, రాగులపాడు, జిల్లెడు బండట్యాంకు, వెంకటాంపల్లితాండా, ధర్మపురి డిస్ట్రిబ్యూటరీ, పందికుంట ట్యాంకు, 34వ ప్యాకేజీ పరిధిలోని డీ1, డీ2 డిస్ట్రిబ్యూటరీలకు ఈనెల 10 నుంచి నీటి సరఫరా బంద్ కానుంది.

పాముకాటుతో కాంగ్రెస్ నాయకురాలి మృతి

కూడేరు: పాముకాటుతో మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు జానకమ్మ (50) శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. జానకమ్మ కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వరస్వామి దేవాలయం వద్ద పూజా సామగ్రి దుకాణం నిర్వహిస్తోంది. వారి కుటుంబం సభ్యులు కూడా అక్కడే నివాసం ఉంటున్నారు. శుక్రవారం వేకువజామున జానకమ్మను పాము కాటేయడంతో గమనించిన భర్త అంజనేయులు పామును చంపేశాడు. తొలుత స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. వైద్య సిబ్బంది సూచన మేరకు అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జానకమ్మ సాయంత్రం మృతి చెందింది.



మృతురాలు జానకమ్మ (ఫైల్)

8వ తరగతి విద్యార్థి అదృశ్యం

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన శివారెడ్డి, పావని దంపతుల కుమారుడు శశిధర్‌రెడ్డి అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం గుత్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలమేరకు... శశిధర్‌రెడ్డి గుత్తి మండలం ఇసురాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అక్కడే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. అయితే రెండు రోజుల క్రితం శశిధర్‌రెడ్డి గుత్తిలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అదే రోజు పాఠశాలకు వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే పాఠశాలకు వెళ్లలేదు, ఇంటికి కూడా రాలేదు. దీంతో కంగారుపడ్డ తల్లిదండ్రులు శశిధర్‌రెడ్డి ఆచూకీ కోసం చుట్టు పక్కల గాలించారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



శశిధర్‌రెడ్డి (ఫైల్)

హత్య కేసులో ముద్దాయిల అరెస్టు

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరంలో బుధవారం రాత్రి భర్త రమేష్ చేతిలో భార్య అంజలి దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముద్దాయిలను ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ నేతృత్వంలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రామదాసులు పోలీసులతో కలసి శుక్రవారం అరెస్టు చేశారు. మృతురాలు అంజలి తండ్రి ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త రమేష్‌ను కళ్యాణదుర్గం వెళ్లే రహదారిలోని గంగవరం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.అలాగే మృతురాలిని వేధిస్తూ ఘటనకు కారణమైన గ్రామానికి చెందిన ఓబులేసును రామసాగరం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



ముద్దాయిలు రమేష్, ఓబులేసు అరెస్టు చూపుతున్న పోలీసులు

భార్య కళ్లెదుటే భర్త బలవన్మరణం

అనంతపురం సిటీ: ఒక్కగానొక్క కుమారుడి (4)ని అల్లారు ముద్దుగా చూసుకుంటూ సాఫీగా సాగిపోవాల్సిన ఆ దంపతులు బాంధవ్యం నిత్యం కలహాలతో నరకప్రాయంగా మారింది. ఇక కలసి జీవించలేమనుకున్న ఆ దంపతులు ఆర్నెల్లుగా విడివిడిగానే ఉంటున్నారు. అయినా వారిలో ఏమాత్రం మార్పు రాకపోగా, తరచూ గొడవ పడుతూ బజారునపడేవారు. ఈ క్రమంలోనే మరోసారి వారిద్దరూ ఇంటి నుంచి గొడవ పడుతూ రైల్వే ట్రాక్ వరకూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆ భర్త.. భార్య కళ్లెదుటే గూడ్స్ రైలు కింద దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం పీటీసీ సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ వివరాలమేరకు.. అనంతపురం రూరల్ మండలం నరసనాయునికుంటకు చెందిన చంద్రా నాయక్ (33), సోమనాథనగర్‌కు చెందిన లత దంపతులు. వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పీటీసీ సమీపానికి చేరుకున్న దంపతులు నడిరోడ్డుపైనే గొడవకు దిగారు. అంతలోనే గూడ్స్ రైలు రాగా.. ఒక్కసారిగా చంద్రానాయక్ దాని కింద దూరి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్నెళ్ల నుంచి విడివిడిగా ఉంటున్న దంపతులు విడాకుల కోసం ప్రయత్నిస్తూనే వస్తున్నారు. జీఆర్పీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి...

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేగడి కొత్తూరులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. రేగడి కొత్తూరుకు చెందిన మంజునాథ్‌రెడ్డి (41) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మంజునాథ్‌రెడ్డికి కాలు బాగా దెబ్బతింది. దీంతో చికిత్స కోసం, కుటుంబ పోషణ కోసం పలు చోట్ల రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలీక మానసిక వేదనతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పుట్లూరులో మహిళ ..

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురంలో క్రిష్ణవేణి (47) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. క్రిష్ణవేణి తన భర్త రామాంజినేయులు నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా స్థానికులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే క్రిష్ణవేణి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నట్లు మృతురాలి కుమార్తె నిరోషా పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విడపనకల్లు: మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి సమీపంలో అనంతపురం - బళ్లారి జాతీయ రహదారిపై లగేజీ బొలెరో అదుపు తప్పింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. నార్పల, రేకులకుంట, బొందలవాడ, బొమ్మలాటపల్లి గ్రామాలకు చెందిన నాగభూషణతో పాటు మరో నలుగురు కలసి కర్ణాటక నుంచి దాదాపు 60 గొర్రెలను లగేజ్ బొలెరోలో వేసుకొని తమ గ్రామాలకు వెళ్తున్నారు. అయితే పెద్ద కొట్టాలపల్లి దగ్గర బొలెరో టైరు పగిలిపోవడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నాగభూషణ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా నలుగురు గాయపడగా.. 108లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై విడపనకల్లు పోలీసులు విచారణ చేపట్టారు.

'తల సైనిక్ క్యాంప్'లో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: ఢిల్లీలోని ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్‌లో జరిగిన 'తల సైనిక్ ' క్యాంప్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరఫున పాల్గొన్న ఉమ్మడి జిల్లాకు చెందిన కేడెట్లు భరత్‌కుమార్, మేఘన ప్రతిభ చాటారు. సెప్టెంబర్ 20 నుంచి ఈనెల 2 వరకూ జరిగిన క్యాంప్‌లో టెంట్ పిచ్చింగ్, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ రెండోస్థానంలో నిలిచింది. ఇందులో అనంతపురం ఆర్ట్స్ కళాశాల విద్యార్థి భరత్‌కుమార్, హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాల విద్యార్థిని మేఘన పాల్గొని చురుకైన పాత్ర పోషించారు. వారు జిల్లాకు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం వారిని 6వ బెటాలియన్ అధికారులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ రంగనాథ్, జూనియర్ కమిషన్ ఆఫీసర్ లింబు, సాగర్ పాల్గొన్నారు.



'తల సైనిక్ క్యాంప్'లో పాల్గొన్న విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

క్లుప్తంగా

బాట్లింగ్ ప్లాంట్ పరిశీలన



బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసిన స్థలంలో స్కెచ్‌ను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలో ఎల్‌పీసీ బాట్లింగ్ ప్లాంట్‌ను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పరిశీలించారు. శుక్రవారం ఆయన డీఎస్‌ఓ శోభారాణితో కలిసి హంపాపురం గ్రామ సమీపంలో సర్వే నంబర్ 76–3ఏలో ఏర్పాటు చేయనున్న ఎల్‌సీసీ బాట్లింగ్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులను తహసీల్దార్ లక్ష్మీ నరసింహతో తెప్పించుకొని పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ రామాంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి హోంగార్డులుగా అవకాశం

అనంతపురం క్రైం: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దరు హోంగార్డు కుటుంబాల్లో ఇద్దరికి కారుణ్య నియామకాల కింద ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అవకాశం కల్పించారు. శుక్రవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాయలంలోని తన చాంబర్‌లో బాధిత కుటుంబాలకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మారెన్న అనే హోంగార్డు కుటుంబానికి రూ.4.29 లక్షల చెక్కును ఎస్పీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులందరూ చేయి చేయి కలిపి ఒక రోజు వేతనాన్ని బాధిత కుటుంబానికి అందించినట్లు తెలిపారు.

సీఐటీయూ పోస్టర్ల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: సీఐటీయూ రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు ఈనెల 14,15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుళు తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులతో కలిసి ప్రాంతీయ సమావేశాల పోస్టర్లు, కరపత్రాలను ఓబుళు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ప్రాంతీయ సమావేశాల్లో రాయలసీమ ప్రాంతంలోని కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం పాల్గొన్నారు.

'వడ్డే ఓబన్న ఆశయాలు కొనసాగిస్తాం'



ఓబన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఆశయాలను కొనసాగించి వడ్డెర్ల అభివృద్ధికి కృషి చేస్తామని వడ్డెర సంఘం నాయకుల మల్లెల వేణుగోపాల్, కుంచెపు లక్ష్మీనారాయణ, గంప రామాంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం రుద్రంపేటలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డెర సంఘం నాయకులు మల్లెల వేణుగోపాల్, లక్ష్మీనారాయణ మాట్లాడారు. వడ్డెర సంఘం నాయకులు మారుతీప్రసాద్, రమణ, సంజీవులు, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ విభాగాన్ని కొనసాగించాలి



వీసీకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును కొనసాగించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్కెయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డికి వినతిపత్రం అందించారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఎస్కెయూలో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సుతో ఎంతో మంది విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీలు పూర్తి చేశారన్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగంనాయకులు హేమంత్ కుమార్, దుబ్బా శ్రీనివాసరెడ్డి, వాసు, సురేష్, హరి, కేశవ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో పరిధిలోని రవాణా సమస్యలు, సలహాలు సూచనలపై ఫోన్‌లో మాట్లాడొచ్చని డిపో మేనేజర్ నాగభూపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు డిపో మేనేజర్ ఫోన్ నంబర్ 08554248553 / 9959225853కు కాల్ చేసి, మాట్లాడొచ్చన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, అందరం సమష్టిగా కార్యోన్ముఖులు అయ్యి, మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని అశోక్‌నగర్‌లోని గార్డెన్స్‌లో ఎమ్మెల్యే అనంత అధ్యక్షతన క్లస్టర్ 1, 2, 4 పరిధిలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలకు 'ఆంధ్రాకు జగనే ఎందుకు సీఎం కావాలంటే'పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమ ఉద్దేశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలి:
టీడీపీ హయాంలో నేతల మధ్య విభేదాలతో నగరంలో అభివృద్ధి జరగలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. 2014 ఎన్నికల కు ముందు బీజేపీ, జనసేన పొత్తుతో టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను కనుమరుగు చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

ప్రతి డివిజన్‌లో రూ.3 కోట్లు:
టీడీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు.. నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టి ఒక్క సీటు కూడా టీడీపీకి ఇవ్వలేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి డివిజన్‌లో రూ.3 కోట్ల వరకు రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.800 కోట్ల వరకు అభివృద్ధికి ఖర్చు చేశామని, అందులో రూ.380 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.30 కోట్ల ప్రభుత్వ వాటాను విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య గత టీడీపీ ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, లక్ష్మణ్, సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, ఓబిరెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు పెన్నోబులేసు, సుజాతారెడ్డి, రాధా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , హాజరైన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: జగనన్న పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సనప గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'.. కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందన్నారు. ఇంటి వద్దకే వైద్యులను పంపి వైద్యం చేయిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనన్నారు. 'తాము టీడీపీ అని ఎమ్మెల్యే పింఛన్లు రానీకుండా చేశబుూరు.. పథకాలు నిలిపివేశారు ' అని ఎక్కడైనా, ఎవరితోనైనా పలికిస్తే తన పదవికి రాజీనామా చేయడానికైనా సిద్ధమని ఎమ్మెల్యే అన్నారు.

ప్రజల సొమ్ము కాజేసిన చంద్రబాబు..
ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశాడు కాబట్టే చంద్రబాబు జైలుకు వెళ్లాడని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ప్రజాసొమ్ము దుర్వినియోగం చేయడం మా ఆయనకు ఏమి అవసరం.. హెరిటేజ్ కంపెనీలో రెండుశాతం అమ్మితే రూ.400 కోట్లు వస్తాయి.. అని నారా భువనేశ్వరి చెప్పడం చూస్తుంటే హెరిటేజ్ కంపెనీ విలువ రూ.20 వేల కోట్లు ఉండొచ్చన్నారు. మనం రైతులకు మంచి చేయాలనుకున్నాం కాబట్టే సహకార పాల డెయిరీ తీసుకొచ్చాం.. ఆత్మకూరులో హంద్రీ నీవా రెండో దశలో ప్యాకేజీకి రూ.9 కోట్ల పనులను పెండింగ్‌లో ఉంటే ఆ తర్వాత టీడీపీ రాగానే రూ.97 కోట్ల అంచనాలు పెంచి పరిటాల సునీత దోచుకోచుకున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేశాం కాబట్టే గర్వంగా చెప్పుకుంటూ ప్రజల గడపల వద్దకు వెళ్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చానని, రైతులకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత బోర్లు వేయించి రైతులకు అండగా నిలుస్తున్నారని, జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మహిళ సహకార డెయిరీని ఏర్పాటు చేశామన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం..
అనంతరం మధ్యాహ్నం నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోని ప్రభుత్వ పథకాలపై వివరించారు. త్వరలోనే అనంతపురం – తగరకుంట రోడ్డు పూర్తవుతుందని, వడ్డుపల్లి నుంచి మదిగుబ్బకు తారు రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, ఎంపీటీసీ పుష్పావతి, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అతిక్‌రెడ్డి, యు.భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా వైద్య పరీక్షలు
రాప్తాడురూరల్: ప్రతి ఇంట్లోనూ అందరికీ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం అనంతపురం రూరల్ పాపంపేట సచివాలయం–4లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంప్ నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ అన్నారు. మొత్తం 637 మందికి డాక్టర్ బాల గణేష్, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అక్కడే మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ మునాఫ్, పంచాయతీ సెక్రటరీ అశోక్ బాబు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

దేశానికే 'ఆరోగ్య సురక్ష' ఆదర్శం

రాప్తాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, వైద్యాధికారి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, వైస్ ఎంపీపీలు బోయ రామాంజినేయులు, మన్నల వరలక్ష్మి, బీసీసెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, డీలర్ లక్ష్మన్న, మన్నల రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రికే వైద్యం చేసిన తనయుడు
రాప్తాడు: రాప్తాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి టి.పెద్ద శ్రీనివాసులు ఉదయం ఆరు గంటల నుంచే శిబిరం ఏర్పాటు పనులు దగ్గరుండీ చూసుకున్నారు. సిబ్బందిని పురమాయిస్తూ అవసరమైన పనులు చకచకా చేయిస్తూ అల్పాహారం సైతం చేయలేదు. మధ్యాహ్న సమయంలో ఎండకు సొమ్మసిల్లి కుర్చీలో పడిపోయాడు. వెంటనే అక్కడున్న ఇతర అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శిని జనరల్ సర్జన్ టి.ఎస్.సూర్యతేజ దగ్గరకు తీసుకెళ్లారు. ఆయన పరీక్షించి.. ఆహారం తీసుకోకపోవడం వల్ల సొమ్మసిల్లాడని, ఇబ్బందేమీ లేదని చెప్పారు. అక్కడ సొమ్మసిల్లిన పంచాయతీ కార్యదర్శి.. వైద్యం చేసిన జనరల్ సర్జన్ ఇద్దరూ తండ్రీ కొడుకులు కావడం గమనార్హం. తన కుమారుడే తనకు వైద్యం చేస్తాడని కలలో కూడా ఊహించలేదని పంచాయతీ కార్యదర్శి టి.పెద్ద శ్రీనివాసులు సంతోషంతో చెప్పారు.



పంచాయతీ కార్యదర్శికి వైద్యం చేస్తున్న తనయుడు టి.ఎస్.సూర్య తేజ

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

రాప్తాడు: మండలంలోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పలు క్రీడల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పద్మజా దేవి, పీఈటీ బాలగొండ మల్లికార్జున తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్–17, 19 విభాగాల్లో గత నెల 27, 28, 29వ తేదీల్లో అనంతపురంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. అండర్–19 విభాగంలో వాలీబాల్ పోటీల్లో లక్ష్మీ, ఖోఖోలో లిఖిత, సాఫ్ట్ బాల్‌లో సాయి కుమార్, తన్మయి, పావని, బేస్ బాల్‌లో వరుణ్, మనోజ్, బాల్ బ్యాడ్మింటన్‌లో కే చరణ్, సి.చరణ్, అండర్–17 విభాగంలో టెన్నిస్‌లో క్రిపాల్, అజయ్ ఎంపికయ్యారన్నారు. వీరు అక్టోబర్, నవంబర్ నెలలో జరిగే వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ పద్మజాదేవి

టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

అనంతపురం క్రైం: సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన టీడీపీ కార్యకర్త సైపుద్దీన్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శివరాముడు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు: ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ జనార్దన్ సూచించారు. శుక్రవారం మండలంలోని మదిగుబ్బ గ్రామం వద్ద ఎస్‌ఐ ప్రయాణికులకు రోడ్డు నిబంధనలు తెలియజేశారు. మద్యం సేవించి, వాహనాలు నడపరాదని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా జాతీయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 14 రకాల పారిశ్రామిక కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ , స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎల్.ఆనందరాజు, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కళ్యాణి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 468 మంది నిరుద్యోగులు రాగా, వారిలో 176 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ కె.నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకర్ రాజు, కళాశాల సీడీసీ కన్వీనర్ కె. దేవకీమణి, విష్ణు, మురళి, సురేంద్ర, మంజువాణి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు పెంపు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా సచివాలయాల వారీగా వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. గతంలో పది ప్రాంతాల్లో మాత్రమే శిబిరాలు నిర్వహించాలనుకున్నామని, మొత్తం 20 ప్రాంతాల్లో క్యాంపులు ఉంటాయన్నారు. ఈ నెల 7న నాయక్‌నగర్ పరిధిలోని క్యాంపును ఎస్‌కేడీ స్కూల్లో , 10న నంబర్ – 1 స్కూల్ , 12న నాల్గో రోడ్డు నేతాజీ స్కూల్లో , 17న కోర్టు రోడ్డు యూపీహెచ్‌సీలో , 18న కోర్టు రోడ్డు నెహ్రూ ఉన్నత పాఠశాలలో , 19, 20న వేణుగోపాల్‌నగర్‌లోని శ్రీనివాస ఐటీఐలో , 21న అరవిందనగర్ ఎస్‌కేడీ స్కూల్లో , 26న శ్రీనివాసనగర్ మున్సిపల్ స్కూల్లో , 27న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో , 31న సరస్వతి విద్యామందిర్‌లో , నవంబర్ 1న అంబేద్కర్‌నగర్ కస్తూర్బా స్కూల్‌లో, 2న ప్రశాంతి జిల్లా సమాఖ్య భవన్, 3, 4న పాతూరు సీడీ హాస్పిటల్, 7న సీవీఆర్ మెమోరియల్ స్కూల్లో, 8న రెండో రోడ్డు అర్బన్ సెంటర్‌లో శిబిరాలు జరుగుతాయన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై శనివారం ఉదయం 10:30 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా లోక్ అదాలత్ చైర్మన్ కే శ్రీనివాసరావు, ఎస్పీ అన్బురాజన్, సీనియర్ సివిల్ జడ్జి దీన హాజరవుతున్నట్లు తెలిపారు.

కాలవకు ధైర్యముంటే బహిరంగ చర్చకు రావాలి

• బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ

రాప్తాడురూరల్: మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు ధైర్యం ఉంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలని బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ సవాల్ విసిరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాలవ శ్రీనివాసులు అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను నమ్మించాలని చూస్తే చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలకు వంతపాడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. సంసారం తెలంగాణలో.. రాజకీయాలు ఆంధ్రలో చేస్తున్న చంద్రబాబు.. సీఎం జగన్‌ను విమర్శించడం తగదన్నారు. కృష్ణా జలాల పునః పంపిణీకి కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు పచ్చ పత్రికలు తప్పుడు రాతలు రాశాయన్నారు. వాటిని ఆధారంగా చేసుకొని కేబినెట్‌లో ఏమి నిర్ణయాలు తీసుకున్నారో అధికారికంగా బయటకు రాకనే, కృష్ణా జలాల పునః సమీక్ష చేయడానికే బీజేపీ కేబినెట్ నిర్ణయం చేసేసినట్లు గగ్గోలు పెడుతున్నారన్నారు. ఇప్పటికే బచావత్ ట్రిబునల్ తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, దాన్ని పునఃసమీక్షకు ఆంధ్రరాష్ట్రం ఒప్పుకోదని ముఖ్యమంత్రి జగన్ కేంద్రానికి చెప్పిన విషయాన్ని మరుగుపరిచి మాట్లాడడం మోసం కాదా? అని నిలదీశారు. చంద్రబాబు జైలు కూడు తింటుంటే ఆ ఫ్రస్టేషన్‌లో కాలవ శ్రీనివాసులు ఏం మాట్లాడుతున్నావో అర్థం కాలేదన్నారు. ముఖ్యమంత్రిని మాట్లాడే భాష తెలియని మూర్ఖుడు కాలవ శ్రీనివాసులు అన్నారు.



సాయినగర్‌లో చెట్టు కింద మధ్యాహ్నం వేళ సేదతీరుతున్న చిరు వ్యాపారి



సప్తగిరి సర్కిల్‌లో మధ్యాహ్నం ఎండవేడికి తాళలేక నీడలో కునుకుతీస్తున్న చిరు వ్యాపారులు

పొట్టకూటి కోసం 'కునుకు'పాట్లు

రెక్కల కష్టం నమ్ముకున్న శ్రమజీవులు వీధి వీధి తిరిగితేనే పూట గడుస్తుంది.. పొద్దంతా తిరిగి వ్యాపారం చేసినా అరకొర పోగవుతుంది.. అలా అలా తిరిగి తిరిగి ఇళ్లకు వెళ్లి మళ్లీ మధ్యాహ్నం వేళ రావడం శ్రమ అనుకున్నారో ఏమో..కాస్తంత నీడ దొరికిందని చిరువ్యాపారులు ఇలా కునుకు తీస్తూ కనిపించారు. నగరంలోని అంబేడ్కర్ భవన్ వెనుక ఏబీవీపీ కార్యాలయం ముందున్న చెట్టు వద్ద, సప్తగిరి సర్కిల్‌లో ఓ భవనం నీడన ఇలా సేదతీరుతుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

